సాక్షి తిరుపతి

గురువారం । 19 । జనవరి । 2023



తిరుపతి బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.58,450

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,221

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.71,200

రిటైల్ వెండి గ్రాము రూ.73.20

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	31	18
చిత్తూరు	31	17
తిరుమల	27	14
గూడూరు	31	20
నగరి	32	19



లేజర్ షో

తిరుపతి నగరంలోని ప్రకాశం పార్కులో వాటర్ డ్యాన్సింగ్ లేజర్ షో విశేషంగా ఆకట్టుకుంటోంది.

– సాక్షి ఫొటో గ్రాఫర్, తిరుపతి

న్యూస్‌రీల్

అడ్మిన్ ఏఎస్పీగా బాధ్యతల స్వీకరణ



ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన అడ్మిన్ ఏఎస్పీ వెంకటరావు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా జి.వెంకటరావు బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు జిల్లాలో ఏసీబీ ఏఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఆయన తిరుపతికి వచ్చారు. బుధవారం ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈయన 2012లో గ్రూప్ వన్ ఆఫీసర్‌గా సెలెక్ట్ అయ్యారు. వెస్ట్‌గోదావరి, అనంతపురం, ఆత్మకూరులో పనిచేస్తూ గుంటూరు ఏసీబీకి బదిలీ అయ్యారు. అనంతరం ఇప్పుడు తిరుపతి అడ్మిన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ తిరుమల శ్రీవారి చెంత పనిచేయడం చాలాఆనందంగా ఉందన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న వార్డు, గ్రామ వలంటీర్ల పోస్టులను భర్తీచేయనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా మండలాల ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు ఆసక్తిగల వారు ఆన్‌లైన్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 30న దరఖాస్తుల పరిశీలన, 31న ఎంపిక, ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. అదే రోజు ఎంపికైన వారి వివరాలు వెల్లడిస్తారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఏవైనా అభ్యంతరాలు, అనుమానాలు ఉంటే సంబంధిత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

స్నేహమే నడిపిస్తోంది

- స్నేహానికి చిరునామాగా విద్యార్థినులు
- రెండుకాళ్లు చచ్చుబడ్డ స్నేహితురాలికి తల్లీదండ్రి వారే!
- నిత్యం వీల్‌చైర్‌పై బడికి తీసుకెళ్లి, మళ్లీ ఇంటికి తీసుకురావడం దినచర్య
- వారి స్నేహానికి అధికారులు సైతం సలాం!

కల్మషం లేనిది.. కష్టసుఖాల్లో తోడుగా నిలిచేది.. ఆర్థిక ఇబ్బందుల్లోనూ వెన్నంటే ఉండేది.. ఆనందంలోనూ ఆత్మీయత పంచేది.. జీవిత చరమాంకందాకా తోడుగా నిలిచేది.. స్నేహం ఒక్కటే..! ఒక్కసారి చిగురిస్తే ఆజన్మాంతం గుర్తుండిపోతుంది. పరిస్థితులు ఏవైనా నేనున్నాననే ధైర్యం ఇస్తుంది. తప్పుచేస్తే దండిస్తుంది.. కష్టమొస్తే కుంగిపోతుంది.. ఇలాంటిదే సత్యవేడు నియోజకవర్గం, కేవీబీపురం మండలంలో వెలుగుచూసింది. విధి ఆడిన వింతనాటకంలో రెండుకాళ్లు చచ్చుబడి లేవలేని స్థితిలో ఉన్న తోటి విద్యార్థినికి స్నేహితులే అండగా ఉంటూ అక్షరాల వైపు నడిపిస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలోని బడికి నిత్యం వీల్ చైర్‌పై తీసుకెళ్తూ.. పాఠశాలలో సపర్యలు చేస్తూ.. వైకల్యాన్ని జయించేలా చేస్తున్నారు. చదువుల తల్లికి తోడుగా నిలుస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. వారి ఆదర్శానికి అధికారులు సైతం సలాం చేస్తున్నారు. అసలు ఆ కథేంటో.. ఆ స్నేహితుల విలువేంటో మీరే చదవండి..

కేవీబీపురం: విధి విసిరిన బాణానికి రెండుకాళ్లు చచ్చుబడినా కుంగిపోలేదు. మనోధైర్యంతో గుండె నిబ్బరం చేసుకుంది. ఒంట్లో సత్తువ లేకపోయినా తోటి స్నేహితుల సాయంతో బడిబాట పట్టింది. చదువుల్లో రాణిస్తూ లక్ష్యం వైపు దూసుకుపోతోంది.. కేవీబీపురం మండలానికి చెందిన జాయిస్. నాలుగేళ్ల పాటు బడికి దూరమైనా స్నేహితురాళ్ల సాయంతో మళ్లీ పెన్ను, పుస్తకం పట్టింది. ప్రభుత్వ సాయంతోపాటు స్నేహితుల సహకారంతో ఉన్నత చదువులు చదువుతానని చెబుతోంది. వివరాల్లోకి వెళ్లితే.. మండలంలోని పెరిందేశం గ్రామానికి చెందిన వెట్టి.ఇజ్రాయిల్, కన్నెమ్మ దంపతులకు దావిద్, జాయిస్ సంతానం. ఇజ్రాయిల్ నగిరి పోస్టు ఆఫీస్‌లో చిరు ఉద్యోగి. కన్నెమ్మ రోజువారి కూలీ. కుమార్తె జాయిస్ (14) 2012లో బంధువుల ఇంట్లో ఆడుకుంటూ టైల్స్‌పై జారిపడింది. అప్పట్లో కాలు విరిగినట్లు ధ్రువీకరించి వైద్యులు కట్టుకట్టి పంపించేశారు. క్రమేణా చిన్నారి కాళ్లు చచ్చుబడుతూ రావడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఉన్న రెండెకరాల పొలంతో పాటు సొంత ఇంటినీ తెగనమ్మి బిడ్డకు మూడు ఆపరేషన్లు చేయించారు. కానీ ఫలితం లేదు. చిన్నారి రెండు కాళ్ల చచ్చుబడ్డాయి. నడవలేని స్థితికి చేరింది. 3వ తరగతి నుంచి ఇంటి వద్దే ఉండిపోయింది. పాఠశాలకు వెళ్లివచ్చే స్నేహితులకు టాటా చెబుతూ సంబరపడేది. రెండేళ్ల క్రితం వారితోపాటు బడికి వెళ్లాలని నిశ్చయించుకుంది. వీల్‌చైర్ కొనిస్తే అన్నతో కలిసి బడికి పోతానని చెప్పడంతో తల్లిదండ్రులు ఒప్పుకున్నారు. వీల్ చైర్ కొనిచ్చారు. దీనికి తోడు అమ్మఒడి, పింఛన్ పథకాలు మంజూరు కావడంతో రెండు కిలోమీటర్ల దూరంలోని రాగిగుంట ఉన్నత పాఠశాలకు తోటి స్నేహితులతో పంపడానికి సమ్మతించారు.



జాయిస్‌ని పాఠశాలకు వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న తోటి విద్యార్థులు

ఉపాధ్యాయుల ఉదాసీనత

జాయిస్ మూడో తరగతిలోనే బడికి దూరమైంది. కాళ్లు రెండూ చచ్చుబడడంతో ఇక బడికి వెళ్లలేనని భావించింది. కానీ చదువుపై ఆ విద్యార్థినికి ఉన్న మక్కువను చూసి ఉపాధ్యాయులే హాజరు వేసి.. హోంవర్క్‌లు ఇచ్చి పై తరగతులకు ప్రమోట్ చేశారు. అలా మూడేళ్లు అంటే ఆరో తరగతి వరకు నెట్టుకొచ్చారు. ఆ తర్వాత బాలికే స్వయంగా బడికిరావడంతో సంబరపడ్డారు.

చిట్టి నేస్తాలు.. పెద్ద సాయం

జాయిస్ పరిస్థితిని అర్థం చేసుకున్న తన స్నేహితురాళ్లు శ్రుతి, మానస, మౌనిక, లావణ్య, భూమిక ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు, పక్క గ్రామంలో ఉన్న ట్యూషన్‌కు నిత్యం తీసుకెళ్లడం.. తీసుకొచ్చి ఇంటి వద్ద వదిలిపెట్టడం బాధ్యతగా తీసుకున్నారు. గ్రామస్తులు, తోటి విద్యార్థినీ, విద్యార్థులు కూడా పాఠశాలలో సపర్యలు చేయడం అలవాటుగా మార్చుకున్నారు. ఎలాంటి బిడియం లేకుండా కాలకృత్యాలకు తీసుకెళ్లడం.. మళ్లీ తీసుకొచ్చి క్లాసురూమ్‌లో కూర్చోబెట్టడం లాంటివి చేస్తుండడంతో అధికారులు సైతం ఆశ్చర్యానికి లోనయ్యారు.

> **డాక్టర్ అవుతా**
>
> మా అమ్మానాన్నా, అన్నయ్య ఎంతో కష్టపడి నన్ను కాపాడారు. కంటికిరెప్పలా పెంచారు. ఇప్పటికే మా పరిస్థితి దారుణంగా ఉంది. చేతిలో చిల్లిగవ్వలేక.. సరైన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా. నాకు కృత్రిమ కాళ్లతో పాటు, ప్రభుత్వం, దాతలు మరింత సాయం అందిస్తే బాగా చదువుకుంటా. డాక్టర్‌ని అయ్యి ప్రతి ఒక్కరికీ నా వంతు సహకారం అందిస్తా.
>
> – జాయిస్ , విద్యార్థిని



ట్యూషన్‌కు వెళ్తున్న జాయిస్

తనకోసం తరగతి గదినే కిందకు మార్చాం

జాయిస్ పరిస్థితిని అర్థం చేసుకుని తొమ్మిదో తరగతి గదిని మిద్దెమీద లేకుండా కిందకు మార్చాం. చదువులో చురుగ్గా ఉంటోంది. కేవీబీపురం దివ్యాంగుల పాఠశాల నుంచి ప్రభుత్వం తరఫున సహకారం అందించాలని కోరాం. జాయిస్ పరిస్థితి తెలుసుకుని తోటి విద్యార్థులే బాధ్యత తీసుకుని అన్నీ చేస్తుండడం గొప్ప విషయం.

– నారాయణమ్మ, రాగిగుంట ఉన్నత పాఠశాల, హెచ్‌ఎం



జాయిస్ కోసం తరగతి గదిని కిందకు మార్చి లోపలకు ఆహ్వానిస్తున్న ఉపాధ్యాయులు

స్నేహితులే అక్కున చేర్చుకున్నారు



జాయిస్ మూడో తరగతి చదువుతున్నపుడు ప్రమాదం జరిగింది. అప్పటి నుంచి మూడేళ్లు బడికి దూరమైంది. తిరిగి రెండేళ్లుగా తన స్నేహితుల సాయంతో బడికి వెళ్తోంది. స్నేహితురాళ్లే బడికి తీసుకెళ్లి, మళ్లీ ఇంటికి తీసుకొస్తున్నారు. తన అవసరాలు కూడా వాళ్లే తీరుస్తున్నారు. వారి పెద్ద మనసుకు దండం పెట్టాలనిపిస్తుంది.

– కన్నెమ్మ, (జాయిస్) తల్లి

ఏమాత్రం కష్టం అనిపించదు



జాయిస్ పరిస్థితి మాకు తెలుసు. అందుకే తనని మా కాళ్లతో నడిపిస్తున్నాం. బడికి, ట్యూషన్‌కి మేమే తీసుకెళ్తాం. అందరం కలిసే భోంచేస్తాం. మా స్నేహితురాలిని మేమే చూసుకుంటాం. తనకి సేవ చేస్తుంటే ఏమాత్రం కష్టం అనిపించదు. జాయిస్ బాగా చదువుతుంది. చదువుల్లో రాణిస్తుంది. మాకు మంచి సలహాలు ఇస్తుంది.

– చందు, (జాయిస్) స్నేహితురాలు

మనోధైర్యానికి సలాం

ఆ వయసు చిన్నారులు పరిస్థితులను అంత సులువుగా అర్థం చేసుకోలేరు. అయితే జాయిస్ మాత్రం తనంతటతానే మనోధైర్యాన్ని నింపుకుని మళ్లీ అక్షరాలకు చేరువైంది. చదువుపై ఎంతో మమకారం ఉన్న జాయిస్‌ను మరింత ప్రోత్సహిస్తాం. విద్యార్థినికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా చర్యలు చేపడుతాం.

–లక్ష్మీపతి, ఎంఈఓ, కేవీబీపురం

పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు 57 పరీక్ష కేంద్రాలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

తిరుపతి క్రైమ్: జిల్లాలో ఈనెల 22న జరిగే పోలీస్ రిక్రూట్‌మెంట్‌కు మొత్తం 57 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పోలీస్ అధికారులు, రీజినల్ కో–ఆర్డినేటర్లతో సమావేశమయ్యారు. ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 22న పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తిరుపతి, పుత్తూరు, గూడూరులో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 31,588 మంది పరీక్షలు రాయనున్నట్టు వెల్లడించారు. ఈ మేరకు డీఎస్పీ స్థాయి అధికారి నేతృత్వంలో 15 ఫ్లైయింగ్ స్క్వాడ్ ఉండగా ఇందులో తిరుపతికి అదనపు ఎస్పీ కులశేఖర్, గూడూరుకి జాయింట్ డైరెక్టర్ రాజేంద్ర, పుత్తూరుకి అడిషనల్ ఎస్పీ విమలకుమారిని నియమించినట్టు తెలిపారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

కానిస్టేబుల్ రాతపరీక్ష కేంద్రాలను ఎస్పీ బుధవారం రాత్రి పరిశీలించారు. పరీక్ష కేంద్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ విధించినట్టు వెల్లడించారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

కుప్పంలో బాబు ఓటమి ఖాయం

- క్షేత్ర స్థాయి నుంచి వైఎస్సార్ సీపీ బలం పెరిగింది
- ప్రజల్లోకి వెళ్లి కష్టపడి పనిచేద్దాం
- టీడీపీ దౌర్జన్యాలు ఇక సాగవు
- రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి పిలుపు

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ బలం క్షేత్రస్థాయి నుంచి బాగా పెరిగిందని, రాబోయే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి ఖాయమని రాజంపేట ఎంపీ, లోకసభ ప్యానల్ స్పీకర్ మిథున్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని సామగుట్టపల్లె క్రాస్‌లోని ఎంఎం మహల్‌లో రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, కుప్పం, కుప్పం మున్సిపాలిటీ పరిధిలోని కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మన బలం ఏమిటో మనకు తెలియదని, కష్టపడి పనిచేస్తే అనుకున్నది సాధించగలుగుతామని తెలిపారు. రాబోయే రోజుల్లో కార్యకర్తలు సైనికుల్లా పనిచేసేందుకు సిద్ధం కావాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 80 శాతం స్థానాలు కైవసం చేసుకుని బలపడిందన్నారు. ఈ జోరును అసెంబ్లీ ఎన్నికల్లో కొనసాగించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలన్నారు. ఎవ్వరూ అధైర్య పడొద్దని, అందరికీ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

హామీలన్నీ నెరవేరుస్తాం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుప్పంలో ఇచ్చిన హామీల న్నింటినీ చెప్పినా సమయం ప్రకారం నెరవేరుస్తామని మిథున్‌రెడ్డి తెలిపారు. హంద్రీ–నీవా కాలువ పనులు శరవేగంగా సాగుతున్నాయని, మార్చి తరువాత కుప్పంకు హంద్రీ–నీవా ద్వారా నీళ్లు తీసుకొస్తామన్నారు. ఒక టీఎంసీ రిజర్వాయర్ పనుల ప్రతి పాదనలు కూడా ప్రభుత్వానికి పంపినట్లు, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఇప్పటికే కుప్పం మున్సి పాలిటీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యే వెంకటేగౌడ తదితరులు

చంద్రబాబుకు మతి భ్రమించింది

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ పొందుతుండంతో చంద్రబాబుకు మతిభ్రమించిందని మిథున్ రెడ్డి ఆరోపించారు. నైతిక విలువలు లేకుండా సీఎంను సైకో అంటూ విమర్శలు చేయడం సరి కాదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఏదైనా మాట్లాడితే దౌర్జన్యం చేస్తున్నారని, నిందలు మోపుతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబుకు భవిష్యత్తు తెలిసిపోయి, తమ పార్టీ పనైపోయిందని మానసిక స్థైర్యం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. పాదయాత్ర ఎవరైనా చేసుకోవచ్చని, దానికి ప్రభుత్వానికి అభ్యంతరం లేదన్నారు. మాట్లాడేభాష అసభ్యకరంగా ఉంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఇప్పటి వరకు కుప్పంలో బూత్ ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేసి, ఇష్టానుసారంగా దొంగ ఓట్లు వేసుకుని చంద్రబాబు గెలుస్తున్నారని, ఇకపై టీడీపీ ఆటలు సాగనీవ్వమన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

శాంతిపురం మండలానికి చెందిన పలువురు క్రియాశీలక టీడీపీ కార్యకర్తలు ఎంపీ మిథున్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తిమ్మరాజుపల్లెకు చెందిన ప్రసాద్, శివ, బుజ్జి, శ్రీనివాసులు, సల్లాపురి, చంద్రబాబు, సుబ్రమణ్యం, వెంకటాచలం, ఎస్.వంశీ తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, అన్ని మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మండల కన్వీనర్లు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

నేటి నుంచి ఆధార్ క్యాంప్‌లు

తిరుపతి అర్బన్: ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణతోపాటు అడ్రస్ మార్పు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రధానంగా జిల్లాను మార్పుచేసుకునే అవకాశాన్ని అందుబాటులోకి తొలిసారిగా తీసుకొచ్చింది. గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించింది. ఈ నాలుగు నెలల్లోనే జిల్లా వ్యాప్తంగా 1,34,000 మందికి సేవలు అందించింది. జిల్లాలోని గ్రామ, వార్డుకు సంబంధించి 691 సచివాలయాలు ఉండగా.. ఇందులో 82 సచివాలయాల్లో గురువారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు ఆధార్ సేవలను అందించనుంది. గతఏడాది నాలుగు నెలలు నిర్వహించిన క్యాంపుల్లో 76 సచివాలయ సెంటర్లు మాత్రమే అందుబాటులోకి రాగా.. ఈ ఏడాది మరో 6 సెంటర్లు అదనంగా అందుబాటులోకి తీసుకొచింది. 112 సెంటర్లకు ఆధార్ కిట్లు పంపించగా.. చిన్నచిన్న సమస్యలతో 30 సెంటర్లలో అందుబాటులోకి రావడంలేదు.

ఆధార్ సేవలు

- నూతనంగా ఆధార్ నమోదు
- 5–15ఏళ్ల బాలబాలికల బయోమెట్రిక్ అప్డేట్
- ఆధార్‌కార్డు ప్రింట్
- ఇంటి చిరునామా మార్పు
- ఇంటి చిరునామాతోపాటు బయోమెట్రిక్ అప్డేట్
- 2016కు ముందు తీసుకున్న వారి ఆధార్ కార్డుల అప్డేట్
- అడ్రస్‌తోపాటు జిల్లా పేరు మార్పు



సచివాలయంలో ఆధార్ క్యాంపు(ఫైల్)

రెండు రోజుల ఆగమ సదస్సు

తిరుపతి అలిపిరి: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీవేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు ఆగమ సదస్సు నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం బుధవారం ఒక ప్రటనలో తెలిపింది. గురు, శుక్రవారాలు రెండు రోజుల పాటు వైఖానస, పాంచరాత్ర, శైవ ఆగమాలలో చెప్పిన బాలాలయ విచారం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు పేర్కొంది.

నేటి నుంచి బహిరంగ విచారణ

తిరుపతి రూరల్: ఎస్పీడీసీఎల్ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సమర్పించిన ఆర్థిక ఆవశ్యకత, విద్యుత్ చార్జీల ప్రతిపాదనలపై ఏపీఈఆర్సీ గురువారం నుంచి మూడు రోజులపాటు బహిరంగ విచారణ జరపనున్నట్లు ఎస్పీడీసీఎల్ తిరుపతి సర్కిల్ ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. బుధవారం తిరుపతిలోని ఎస్ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఈఆర్సీ చైర్మన్ జస్టిస్ నాగర్జునరెడ్డి అధ్యక్షతన విశాఖపట్నం నుంచి ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించే ఈ బహిరంగ విచారణలో జిల్లా వాసులు ఎవరైనా పాల్గొనవచ్చన్నారు. అందుకోసం తిరుపతిలోని ఎస్ఈ కార్యాలయం, మదనపల్లి, చిత్తూరు, పుత్తూరు, పీలేరు డివిజన్ ఈఈ కార్యాలయాల్లో ఏర్పాట్లు చేపట్టినట్టు చెప్పారు. వినియోగదారులు, అభ్యంతరాలు, సలహాలు చెప్పాలనుకునేవారు నేరుగా కానీ, ఆన్‌లైన్ ద్వారా కానీ పాల్గొనవచ్చని సూచించారు.



కృష్ణారెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ

క్లుప్తంగా

శభాష్ వలంటీర్



చెన్నైలో చికిత్స పొందుతున్న రాజ్యలక్ష్మికి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్ లత

ఏర్పేడు: ఓ లబ్ధిదారు చెన్నైలోని ప్రయివేటు ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ చేసుకుని చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ చెన్నై వెళ్లి ఈకేవైసీ చేసి శభాష్ అనిపించుకుంది. వివరాలు.. మండలంలోని పాపానాయుడుపేటకు చెందిన ఈబీసీ నేస్తం లబ్ధిదారురాలు రాజ్యలక్ష్మి మూడు రోజుల క్రితం గుండె పోటుకు గురై చెన్నైలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేసుకుని చికిత్స పొందుతోంది. ఈకేవైసీ చేసుకుంటే ప్రభుత్వం నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాకు జమచేస్తుంది. సర్పంచ్ లలిత, పంచాయతీ కార్యదర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి సూచనల మేరకు వలంటీర్ లత ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారురాలికి ఈకేవైసీ చేసి మన్ననలు అందుకుంది.

కారు ధ్వంసం

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు ధ్వంసమైంది. సీఐ శ్రీహరి కథనం.. తిరుపతి నుంచి శ్రీకాళహస్తికి వెళుతున్న కారును సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైంది. కారులోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాలేదు. కేసు దర్యాప్తులో ఉంది.

ఆనందం నింపినది!

- అట్టహాసంగా ముగిసిన ఏటి పండుగ సంబరాలు
- స్వర్ణముఖి నదీతీరాన మిన్నంటిన సాంస్కృతిక కార్యక్రమాలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, పక్కన మున్సిపల్ చైర్‌పర్సన్, ఇతర అధికారులు

నాయుడుపేట టౌన్: స్వర్ణముఖి నదీతీరాన మూడు రోజులుగా జరిగిన ఏటి పండుగ సంబరాలు బుధవారం అట్టహాసంగా ముగిశాయి. రకరకాల రంగుల రాట్నాలు, ఎల్‌ఈడీ లైట్లు, సాంస్కృతిక సంబరాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నిస్సీ ఈవెంట్ ఆర్గనైజర్ మేర్లపాక హరి ఆధ్వర్యంలో జబర్దస్త్ ఫేమ్ ఆటో రామ్‌ప్రసాద్, సునామి సుధాకర్, రాజామౌళి, తన్మయ తదితర బుల్లితెర నటులు, డీ డ్యాన్స్ గ్రూప్ యువకులతో నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గతంలోకన్నా భిన్నంగా ఉత్సవాలు నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో చైర్‌పర్సన్ కటకం దీపిక, అధికారుల నేతృత్వంలో ఏటి పండుగను విజయవంతం చేశారు. వేల మంది ప్రజలు విచ్చేసి ఉత్సవాలు తిలకించి పరవశించారు. బుల్లితెర నటులతో పాటు కళాకారులను ఎమ్మెల్యేతోపాటు కమిషనర్ శ్రీనివాసరావు తదితరులు సత్కారించారు.

సందడే..సందడి

చివరి రోజు చిన్నపెద్ద తేడాలేకుండా కేరింతలు కొడుతూ సందడి చేశారు. కులమతాలకు అతీతంగా ముస్లింలు, హిందువులు అన్నివర్గాల వారు ఏటి పండగలో ఉత్సాహంగా పాల్గొన్నారు. కొత్తగా వివాహాలు చేసుకున్న దంపతులు, సంక్రాంతి పండుకు అత్తారింటికి వచ్చే అల్లుళ్లు, చిన్న నాటి స్నేహితులతో స్వర్ణముఖి తీరం నిండిపోయింది. వివిధ రకాల పిండివంటలతో పాటు ఇష్టమైన భోజన పదార్థాలను వండుకుని నది వద్దకు తీసుకొచ్చి స్నేహితులు, బంధువులతో కలసి సహపంక్తి భోజనాలు చేశారు. పిల్లలు రంగులరాట్నాలలో తిరుగుతూ సందడి చేశారు. మహిళలు ఇంటి నుంచి గౌరీదేవి, గొబ్బెమ్మ తదితర ప్రతిమలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో నది వద్ద పూజలు జరిపి నిమజ్జనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. నదీతీరాన వెలసిన ప్రసూనాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వర్ణముఖీ నది వద్ద మున్సిపల్ అధికారులు ఉచితంగా తాగునీటిని అందించారు.





గోపీయాదవ్ మృతి పార్టీకి తీరని లోటు



గోపీయాదవ్ పార్థీవ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి

- నివాళి అర్పించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యేలు

బుచ్చినాయుడుకండ్రిగ: యువ బీసీ నాయకుడు గోపీయాదవ్ హఠాన్మరణం బుచ్చినాయుడుకండ్రిగ మండల వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విచారం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన అనంతపురం జిల్లా, తాడిపత్రి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు బీరేంద్రరాజుతో కలిసి మండలంలోని గోపీయాదవ్ స్వగృహానికి చేరుకున్నారు. అనంతరం గోపీయాదవ్ పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ, ప్రభుత్వపరంగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. హుషారుగా ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేశారని, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులను కలసి పేదల సమస్యల పరిష్కారానికి కృషి చేశారని గుర్తుచేశారు. క్రియాశీలక రాజకీయాల్లో ముందుండే బీసీ నాయకుడిని కోల్పోవడం మనసుని కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే గుండె పోటుతో గోపి మృతి చెందడం బాధగా ఉందన్నారు. శ్రీకాళహస్తీశ్వరుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో శ్రీకాళహస్తి, గూడూరు ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్‌రావు, శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టు బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురునాథం, గోపాల్‌రెడ్డి, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్‌లోపు ఆస్పత్రిలో చేర్పించండి



రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

- 24 వరకు జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు
- గుడ్ సమారిటన్ ప్రోత్సాహక నగదు రూ.5 వేలు
- కలెక్టర్ వెల్లడి

తిరుపతి అర్బన్: రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని గోల్డెన్ అవర్‌లోపు ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన వీడియోకాన్ఫరెన్స్‌లో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ చర్యలపై నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ అధికారులు, డ్రైవర్లు, హెల్త్, పోలీస్, డీఎల్‌డీఓ, రవాణాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 24 వరకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారోత్సవాలు 'స్వచ్ఛత పఖ్వాడ–'యువశక్తి ద్వారా సామాజిక మార్పు' అనే నినాదంతో చేపడుతున్నట్టు వెల్లడించారు. పుత్తూరు–నాయుడుపేట రహదారుల పనులు పురోగతిలో ఉన్నాయని, ప్రమాదకర మలుపుల వద్ద భద్రతాపరమైన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని వాహనాల వెనుక వైపున రేడియం స్టిక్కర్ ఏర్పాటు చేసుకునేలా సంబంధిత రవాణాశాఖ, పోలీసు అధికారులు చూడాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన గుడ్ సమారిటన్ స్కీం కింద ఎవరైనా రోడ్డు ప్రమాదంలో గాయపడి.. వారిని గోల్డెన్ హవర్‌లో ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేస్తే అలాంటి వారికి ప్రోత్సాహకంగా రూ.5 వేలు అందించనున్నట్టు తెలిపారు. అనంతరం రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమీక్షలో జిల్లా రవాణాశాఖ అధికారి సీతారాంరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ విజయ్, డీఎల్‌డీఓ సుశీలాదేవి, రవాణాశాఖ ఎంవీఐలు, ఎస్‌హెచ్‌ఓలు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అన్నివిధాలా అండ



సిమెంటు బస్తాలు పంపిణీ చేస్తున్న మంత్రి రోజా

వడమాలపేట : నగరి నియోజకవర్గంలోని నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుంటానని రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అన్నారు. బుధవారం మండలంలోని ఏఎంపురం సచివాలయ పరిధిలోని ఏఎంపురం, నారాయణపురం(బట్టికండ్రిగ)గ్రామాల్లోని 27 మంది నిరుపేద కుటుంబాలకు రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా 870 సిమెంటు బస్తాలను వితరణగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనను రెండు పర్యాయాలు ఎమ్మెల్యే గెలిపించిన ప్రజల కోసం ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో పాటు తన వంతు సాయం అందిస్తూ పేదలను ట్రస్టు ఆధ్వర్యంలో ఆదుకుంటున్నానని తెలిపారు. గడపకు–గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తమ గృహాలు లీకేజీ అవుతున్నాయని తన దృష్టికి తెచ్చారని, వారందరికీ సిమెంటు బస్తాలు పంపిణీ చేస్తున్నానని తెలిపారు. ఏఎంపురం సచివాలయ పరిధిలోని సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరయ్యాయని, అందులో బట్టికండ్రిగ పంచాయతీకి రూ. 5లక్షలు, ఏఎంపురం పంచాయతీకి రూ.15 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. వివిధ అభివృద్ధి పనులకు తుడా నిధులు రూ.6 లక్షలు, ఎమ్మెల్యే నిధులు కూడా కేటాయించినట్లు తెలిపారు. మంత్రి సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, వైస్ ఎంపీపీ లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉద్యోగోన్నతి వద్దనుకున్నారు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జెడ్పీ హైస్కూళ్లలో ఖాళీగా ఉన్న ఇంగ్లిష్ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. హైస్కూల్స్‌లో ఇంగ్లిష్ టీచర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఉద్యోగోన్నతుల ప్రక్రియను నిర్వహించారు. ఈ మేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని 66 మండలాల్లో సీనియర్‌లైన ఎస్జీటీ టీచర్లకు ఉద్యోగోన్నతి కల్పించాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం చిత్తూరు విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ విజయేంద్రరావు పర్యవేక్షణలో టీచర్లకు కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించారు. ఉద్యోగోన్నతి అంటే సంబరపడాల్సిన టీచర్లు తమకొద్దంటూ ఎక్కువగా అన్‌విల్లింగ్ రాసిచ్చారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 47 ఇంగ్లిష్ పోస్టుల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇందుకు నిబంధనల ప్రకారం 123 మంది సీనియర్ ఎస్జీటీలను పిలిపించారు. ఆ 123 మందిలో 30 మంది ఉద్యోగోన్నతులు కావాలని, మిగిలిన 93 మంది తమకు ఉద్యోగోన్నతులు అవసరం లేదని లిఖిత పూర్వకంగా రాసిచ్చారు. దీంతో మిగిలిన 17 పోస్టులను భర్తీ చేసేందుకు రోస్టర్ సినియారిటీ జాబితాను తయారుచేసి రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు తరువాత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌లు వీజీ రమణ, నాగరాజు, సిబ్బంది మురళి, గోపాల్, ప్రేమ్, జయప్రకాష్, సుబ్బు పాల్గొన్నారు.

శేషవస్త్రాల వినియోగంపై ఆంక్షలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రముఖులకు వేదపండితుల ఆశీర్వచనం సమయంలో ఇచ్చే శేషవస్త్రాల వినియోగంపై ఆంక్షలు విధిస్తూ ఈవో సాగర్‌బాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రముఖులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి శేషవస్త్రం అందజేస్తారు. ఇప్పటివరకు ఈ శేషవస్త్రాలు పీఆర్వో కార్యాలయం నుంచి అందుతుండేవి. వాటి దుర్వినియోగం జరగకుండా చూడాలనే ఉద్దేశంతో ఆంక్షలు విధిస్తున్నట్లు ఈవో తెలిపారు. ఇకనుంచి ఈ వస్త్రాలు ఏఈవో, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణలో ఉంటాయని పేర్కొన్నారు. ఏయే ప్రముఖులకు వస్త్రాలను అందజేశారనేది రిజిస్టర్‌లో నమోదు చేయాలని, 15 రోజులకు ఒకసారి తాను తనిఖీ చేస్తానని తెలిపారు. వేదపండితుల ఆశీర్వాదానికి టికెట్ ధర నిర్ణయిస్తామని పేర్కొన్నారు.

టీటీడీ ఉద్యోగి ఇంట్లో చోరీ

తిరుపతి క్రైమ్: టీటీడీ ఉద్యోగి ఇంట్లో భారీ చోరీ జరిగిన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి పోలీసుల కథనం.. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీ కాలనీ, ఎస్‌ఎల్వీ నగర్ రెండో వీధిలో మునిఢిల్లీబాబు నివాసం ఉంటున్నారు. ఈయన టీటీడీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సంక్రాంతి పండుగకు సొంత ఊరైన చిన్నగొట్టుగల్లు మండలం, చిట్టేచార్ల గ్రామానికి గత శనివారం వెళ్లారు. బుధవారం వచ్చి చూసేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి, ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడిఉన్నాయి. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించగా క్లూస్‌టీమ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఇంట్లో ఉన్న 120 గ్రాముల బంగారు, ఒకటిన్నర కేజీ వెండితో పాటు ఐపాడ్‌ను దొంగలు ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. దీనిపై పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేయనున్నారు.

కాలుజారి పడి వృద్ధుడి మృతి

ఏర్పేడు: కాలినడకన వెళుతూ కాలుజారి స్వర్ణముఖి నదిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన మండలంలోని చెన్నంపల్లిలో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. మండలంలోని చెన్నంపల్లి గ్రామానికి చెందిన నక్కా గురుస్వామి(65) సొంతపనులపై పాపానాయుడుపేటకు వెళ్లాడు. పనులు ముగించుకుని బుధవారం రాత్రి 7.30 గంటల సమయంలో తిరిగి స్వగ్రామానికి వెళ్లడానికి కాలినడకన బయలు దేరాడు. పాపానాయుడుపేట సమీపంలోని స్వర్ణముఖి నదిలోని మట్టి రోడ్డు ఒక ప్రాంతంలో తుపానుకు కోతకు గురైంది. కోతకు గురైన ప్రాంతంలో గ్రామస్తులు దాటుకునేందుకు తాడిచెట్టు, విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గురుస్వామి దాటుతుండగా కాలుజారి స్వర్ణముఖి నదిలో ప్రవహిస్తున్న నీటిలో పడిపోయాడు. ఆపై సిమెంట్ పైపు(తూము)లో ఇరుక్కుని గురుస్వామి మృతి చెందాడు. గ్రామస్తులు గురుస్వామి మృతదేహాన్ని మంచంపై ఉంచుకుని ఇంటికి తరలించారు. స్వర్ణముఖి నదిలో కోతకు గురైన ప్రాంతంలో సక్రమంగా పైపులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని గ్రామస్తులు వాపోయారు.

యువకుడి అనుమానాస్పద మృతి

చిల్లకూరు: మండలంలోని ముత్యాలపాడు గ్రామ సమీపంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని బుధవారం స్థానికులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి వివరాలు.. ముత్యాలపాడు గ్రామానికి చెందిన ఆత్మకూరు ప్రసాద్(24) ఎలక్ట్రీషియన్. ఈక్రమంలో అతను గత రెండు రోజుల క్రితం పనికోసమని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఈ నేపథ్యంలో గ్రామ సమీపంలోని చెరువు తూము వద్ద మృతదేహం ఉండడాన్ని అటుగా వెళ్లిన వారు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు అది ప్రసాద్‌దని నిర్ధారించారు.

శ్రీకాళహస్తీశ్వర మహత్యం.. విస్తృత ప్రచారం



ఆన్‌లైన్‌లో శ్రీకాళహస్తి మహత్యాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుని మహత్యాన్ని ఆన్‌లైన్ ద్వారా విస్తృత ప్రచారం చేస్తామని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పరిపాలనా భవనంలో జ్ఞానప్రసూనాంబ డాట్.కం పేరిట ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ స్థానికుడైన ప్రసూనాంబ దొరస్వామి శ్రీకాళహస్తీశ్వరస్వామిపై భక్తితో శ్రీకాళహస్తి చరిత్ర ఆన్‌లైన్‌లో భక్తులందరూ క్షుణ్ణంగా తెలుసుకునే విధంగా వెబ్‌సైట్‌లో పొందుపరచడం అభినందనీయమన్నారు. భక్తులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని బయోనెట్స్ సీఓ కళారాణి మాట్లడుతూ శ్రీకాళహస్తీశ్వరస్వామి చరిత్ర నెట్‌లో లభించడం మహద్భాగ్యమన్నారు.

తిరుపతి బస్టాండ్‌లో కదిరి ప్రేమ జంట

- బాలికతో వివాహం
- ఈస్ట్ పోలీసులకు అప్పగించిన ఆర్టీసీ ఉద్యోగులు
- బెంగుళూరులోను మిస్సింగ్ కేసు నమోదు

తిరుపతి అర్బన్: అనంతపురం జిల్లా కదిరి ప్రాంతానికి చెందిన ఓ ప్రేమజంట తిరుమలలో పెళ్లిచేసుకుని.. తిరుగు ప్రయాణంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని అనతపురం బస్ ప్లాట్‌ఫాం వద్ద ఆర్టీసీ సెక్యూరిటీకి అనుమానంగా కనిపించింది. దీంతో వారు ఆ జంటను విచారించారు. ఈ క్రమంలో వారు వివాహం చేసుకున్నట్లు వెల్లడించారు. మరోవైపు వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బెంగుళూరు సిటీలోని కొన్నగుంట పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు ఇచ్చినట్లు తెలుసుకున్నారు. దీంతో బస్టాండ్‌లో డ్యూటీలో ఉన్న పోలీసులు వెంకటేశ్వర్లు, కొండారెడ్డి ఆ ప్రేమ జంటను ఈస్ట్ పోలీసులకు అప్పగించారు. బాలిక వయస్సు(15), యువకుడి వయస్సు 21గా వెల్లడించారు.

పసికందు మృతిపై విచారణ

- విచారణకు ఆదేశించిన కలెక్టర్
- కమిటీ నియామకం.. విచారణ ప్రారంభం



బిడ్డ మృతిపై విచారణ చేపడుతున్న వైద్యాధికారులు

చిత్తూరు రూరల్: ఆరు రోజుల బిడ్డ మృతిపై చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బుధవారం వైద్యాధికారులు విచారణ చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిత్తూరు నగరం సంతపేటకు చెందిన భవ్యశ్రీ అనే గర్భిణి గతనెల 14వతేదీన ప్రసవం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆశ్రయించింది. అక్కడి డాక్టర్లు సుఖ ప్రసవం చేయడంతో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే రెండోరోజు బిడ్డకు ఊపిరితీసుకోవడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక్కడి డాక్టర్లు వెంటిలేటర్‌పై ఉంచి వైద్యం అందించిన బిడ్డ పరిస్థితి బాగలేకపోవడంతో తిరుపతిలోని రుయాకు రెఫర్‌చేశారు. తీరా అక్కడ చికిత్స పొందుతూ బిడ్డ ఆరో రోజు కన్నుమూసింది. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ హరినారాయణన్ బిడ్డ మృతిపై విచారణకు ఆదేశించారు. నలుగురు డాక్టర్లతో ఓ కమిటీ వేశారు. దీంతో డాక్టర్ అరుణ్‌కుమార్, పాల్ రవికుమార్, మమత, పెంచులయ్య బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరా మొదలు పెట్టారు. గత నెల 14, 15 తేదీల్లో డ్యూటీ చేసిన కిందిస్థాయి సిబ్బంది నుంచి డాక్టర్ల వరకు అందరినీ విచారించారు. గర్భిణి ఎప్పుడు డెలివరీ కోసం వచ్చింది? నొప్పులు వచ్చినప్పుడు డాక్టర్లు, సిబ్బంది ఏ విధంగా స్పందించారు? సకాలంలో ప్రసవ సేవలు అందించారా? ఆ సమయంలో ఎవరెవరూ ఉన్నారు? బిడ్డకు ఊపిరాడకపోవడానికి గల కారణాలు? రుయాలో ఏ విధామైన చికిత్స అందించారు..ఎలా చనిపోయారనే విషయాలపై లోతుగా విచారించారు. ఈ విచారణ పూర్తయిన తరువాత నివేదిక కలెక్టర్‌కు సమర్పిస్తామని అధికారులు పేర్కొన్నారు.